నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి టీ20

ఆఖరి పోరు

రాత్రి 7 నుంచి

సీనియర్లు అందుబాటులో లేకున్నా.. యువ ఆటగాళ్లు దుమ్మురేపడంతో ఇప్పటికే టీ20 సిరీస్ చేజిక్కించుకున్న భారత్.. నేడు ఆస్ట్రేలియాతో ఆఖరి పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. టాపార్డర్ మంచి జోరు మీద ఉండగా.. బౌలర్లు కూడా లయ అందుకున్నట్లే కనిపిస్తున్నారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగనున్న ఈ మ్యాచ్‌లో పరుగుల వరద ఖాయమే కాగా.. మరి ఆ విజ్యం ఖించే వీరులెవరో చూడాలి!

బెంగళూరు: వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం నుంచి త్వరగానే తేరుకున్న భారత జట్టు.. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్ చేజిక్కించుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3-1తో కైవసం చేసుకున్న యంగ్‌ఇండియా.. ఆదివారం చివరి పోరులో కంగారూలతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి వరల్డ్‌కప్ ఫైనల్ పరాజయానికి కాస్త అయినా బదులు తీర్చుకోవాలని సూర్యకుమార్ సేన భావిస్తుంటే.. విజయంతో పర్యటనను ముగించాలని కంగారూలు చూస్తున్నారు. ఈ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మూడు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు నమోదు కాగా.. గత పోరులో మాత్రం అందుకు భిన్నంగా బౌలర్లు రాణించారు. చిన్నస్వామి స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలం కాగా.. భారీ స్కోర్లు ఖాయమే. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ ఫుల్ జోష్‌లో ఉండగా.. శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ స్థాయికి తగ్గ ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మకు తుది జట్టులో అవకాశం కష్టమే. అతడి కోసం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన శ్రేయస్‌ను పక్కన పెట్టకపోవచ్చు. గత మ్యాచ్‌లో చక్కటి బౌలింగ్ ప్రదర్శన కనబర్చిన అక్షర్ పటేల్‌కు రెస్ట్ ఇచ్చి అతడి స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ముఖేశ్ కుమార్, దీపక్ చాహర్, అవేశ్ ఖాన్ మరోసారి పేస్ భారాన్ని మోయనున్నారు. ఆస్ట్రేలియా కూడా గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగనుంది. ట్రావిస్ హెడ్ తప్ప వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులోని సభ్యులంతా స్వదేశానికి తిరిగి వెళ్లడంతో ఆసీస్ జట్టులో అనుభవలేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. అయితే కంగారూలను తక్కువ అంచనా వేయడానికి లేదు. హెడ్, డేవిడ్, షార్ట్, వేడ్, ఫిలిప్, ఆరోన్‌తో కంగారూల బ్యాటింగ్ బలంగానే ఉంది. బౌలింగ్‌లో బెహ్రాన్‌డార్ఫ్‌ను ఎదుర్కోవడం మనవాళ్లకు కష్టంగా మారింది.

పిచ్, వాతావరణం

బౌండ్రీ చిన్నది కావడంతో ఇక్కడ పరుగులు వరద పారడం ఖాయమే. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. మ్యాచ్ కు వర్షం ముప్పులేదు. ఇటీవల ప్రపంచకప్‌లో భాగంగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, శ్రేయస్/తిలక్, జితేశ్, రింకూసింగ్, అక్షర్/సుందర్, దీపక్, రవి, అవేశ్, ముఖేశ్.

ఆస్ట్రేలియా: వేడ్ (కెప్టెన్), ఫిలిప్, హెడ్, మెక్‌డర్మాట్, హార్డీ, టిమ్ డేవిడ్, షార్ట్, డ్వార్షే, గ్రీన్, బెహ్రాన్‌డార్ఫ్, తన్వీర్.

గ్రాండ్‌మాస్టర్ వైశాలి

సోదరుడు ప్రజ్ఞానందతో కలిసి అరుదైన ఘనత

చెన్నై: భారత యువ చెస్ ప్లేయర్ ఆర్ వైశాలికి గ్రాండ్‌మాస్టర్(జీఎం) హోదా దక్కింది. స్పెయిన్ వేదికగా జరుగుతున్న లోబ్రెగెట్ ఓపెన్‌లో టైటిల్ గెలువడం ద్వారా వైశాలి జీఎం హోదాకు అవసరమైన 2500 ఎలో రేటింగ్ పాయింట్లను దక్కించుకుంది. ఈ క్రమంలో భారత 84వ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించడంతో పాటు మూడో మహిళా జీఎంగా నిలిచింది. దీనికి తోడు తన సోదరుడు ఆర్ ప్రజ్ఞానందతో కలిసి ప్రపంచంలోనే తొలి సోదర, సోదరి జోడీగా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. స్పెయిన్ టోర్నీ రెండో రౌండ్‌లో టర్కీకి చెందిన తామెర్ తారిక్‌ను ఓడించడంతో వైశాలి 2500 పాయింట్లను చేరుకుంది. జీఎం హోదా దక్కించుకున్న వైశాలిని భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్(ఎక్స్)లో అభినందించాడు. 'గత కొన్ని నెలలుగా వైశాలి చాలా కష్టపడింది. ఏప్రిల్‌లో జరిగే క్యాండిడేట్స్ టోర్నీలో బరిలోకి దిగనుంది. వైశాలి విజయాల వెనుక వాళ్ల తల్లిదండ్రుల కఠిన శ్రమ దాగుంది' అని రాసుకొచ్చాడు.

1 చదరంగంలో గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న తొలి అక్కాతమ్ముడిగా ప్రజ్ఞానంద, వైశాలి రికార్డుల్లోకెక్కారు.

3 భారత్ నుంచి కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తర్వాత గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న మూడో మహిళగా వైశాలి నిలిచింది.

జెహ్రా పాంచ్ పటాకా

జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కర్ని సింగ్ షూటింగ్ రేంజ్(న్యూఢిల్లీ) వేదికగా జరుగుతున్న జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ జెహ్రా ముఫ్పద్దల్ దేశ్‌వాలా ఐదు పతకాలతో దుమ్ము రేపింది. మహిళల జూనియర్ వ్యక్తిగత ఈవెంట్‌తో పాటు టీమ్‌ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్‌లోనూ తనదైన ప్రతిభ చాటుతూ జెహ్రా పతకాలు కొల్లగొట్టింది. మహిళల సీనియర్ విభాగంలోనూ ఈమె తొలి రజత పతకాన్ని ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం లయోలా కాలేజీలో చదువుతున్న జెహ్రా షూటింగ్‌లో నిలకడగా రాణిస్తున్నది.

తుది పోరులో భారత జోడి

లక్నో : సయ్యద్ మోది అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో భారత్ జోడి త్రిష క్రాస్టా-అశ్విని పొన్నప్ప ఫైనల్స్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో తొలి గేమ్‌లో 10-11తో భారత జోడి వెనుకంజలో ఉన్న సమయం లో ప్రత్యర్థి జపాన్ జోడి యుకి ఫుకుషిమ-సయాక హిరొట గాయంతో పోటీ నుంచి విరమించుకున్నారు. దీనితో క్రాస్టా-అశ్వినిలను విజయం వరించింది. కాగా పురుషుల సింగిల్స్‌లో ప్రియాంశు రజవత్ 21-18, 14-21, 17-21 చి యు జెన్ చేతిలో ఓడిపోయాడు.

రష్మిక జోడీకి టైటిల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో రష్మిక, వైదేహి చౌదరీ జోడీ విజేతగా నిలిచింది. శనివారం మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక, వైదేహి ద్వయం 6-1, 6-2తో సోహా సాదిక్, అకాంక్ష జంటపై అలవోక విజయం సాధించింది. మ్యాచ్ మొదటి నుంచే తమదైన దూకుడు కనబరిచిన రష్మిక జోడీ వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. మరోవైపు సింగిల్స్ సెమీ ఫైనల్లో రష్మిక 3-6, 2-6తో అనస్తషియా సుకోతినా(రష్యా) చేతిలో ఓటమిపాలైంది.

ఫైనల్లో 12మంది బాక్సర్లు

న్యూఢిల్లీ : అర్మేనియాలోని ఎరెవాన్‌లో జరుగుతున్న ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 12మంది భారత బాక్సర్లు ఫైనల్లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన ఆరంభ పోటీల్లో అమిష(54కి.), పాయల్(48కి.) 5-0 తేడాతో ప్రత్యర్థులపై విజయాలు నమోదు చేసి ఫైనల్లో ప్రవేశించారు. ప్రచి((80ప్లస్), మేఘ(80కి.) ప్రత్యర్థులపై విరుచుకుపడడంతో రెఫరీ మధ్యలోనే పోటీని నిలిపివేసి భారత బాక్సర్లను విజేతలుగా ప్రకటించారు. విని(75కి,), ఆకాంక్ష(70కి.), శృతి(63కి.) 5-0 తేడాతో ప్రత్యర్థులను మట్టికరపించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. నిషా(52కి.) ఆరంభంలో తడబడినా పుంజుకుని 4-1తో విజయం సాధించింది. బాలురలో అయిదుగురిలో నలుగురు విజయాలతో ఫైనల్స్‌కు అర్హత సాధించారు. హార్దిక్ పన్వర్(80కి.), హేమంత్ సంగ్వాన్(80ప్లస్) ప్రత్యర్థులను చిత్తుగా ఓడించారు. జతిన్(54కి.) 4-1తో, సాహిల్ 3-2తో విజయాలు సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. కాగా నేహ(46కి.), నిధి(66కి.), పరి(50కి.), కృతిక(75కి.), సికిందర్(48కి.) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

బంగ్లాదే తొలి టెస్టు

తైజుల్ (4/109, 6/75)

ఢాకా: లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ ఆరు వికెట్లతో అదరగొట్టడంతో న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో బంగ్లాదేశ్ విజయం సాధించింది. ఈ గెలుపుతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియాను వెనక్కినెట్టిన బంగ్లా రెండో స్థానానికి ఎగబాకింది. 332 పరుగుల లక్ష్యఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 113/7తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 181 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిషెల్ (58) తప్ప మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు.

టైటాన్స్ ఓటమి

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) పదో సీజన్ పోరును తెలుగు టైటాన్స్ పరాజయంతో మొదలుపెట్టింది. శనివారం జరిగిన లీగ్ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 32-38 తేడాతో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓటమి పాలైంది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ తరపున రైడర్ సోను 11 పాయింట్లతో విజృంభించగా, సహచరుడు రాకేశ్ డిఫెన్స్‌లో 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు తెలుగు టైటాన్స్ కెప్టెన్ పవన్ షెరావత్ 11 పాయిట్లతో ఆకట్టుకున్నా..జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు.

ప్రపంచకప్ హాకీలో భారత ఓటమి

శాంటియాగొ(చిలీ) : ప్రపంచకప్ జూనియర్ హాకీ మహిళల టోర్నీలో భారత్ వరుసగా రెండో ఓటమి ఎదుర్కొన్నది. శనివారం ఉత్కంఠగా సాగిన పోరులో భారత జట్టు 2-3 స్కోరుతో బెల్జియం చేతిలో ఓడిపోయింది. ఆరంభంలో నోవా షెర్స్(5ని.), డి మాట్(42ని.) గోల్స్‌తో బెల్జియం ఆధిక్యంలో నిలిచింది. అన్ను 47ని, 51ని.లలో పెనాల్టీ కార్నర్, పెనాల్టీ స్ట్రోక్స్ ద్వారా గోల్స్ సాధించి జట్టును పోటీలో నిలిపింది. అయితే చివరి క్షణాల్లో బొనామీ(52ని.) పెనాల్టీ స్ట్రోక్‌తో బెల్జియంకు విజయం అందించింది. భారత జట్టుకు ఇది వరుసగా రెండో పరాజయం. మూడు పాయింట్లతో భారత జట్టు ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతోంది.

ఈ నెల 9న డబ్ల్యూపీఎల్ వేలం

ముంబై: ముంబై వేదికగా ఈ నెల 9న మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) వేలం జరుగనుంది. రానున్న సీజన్ కోసం జరుగనున్న సీజన్ కోసం మొత్తం 165 మంది ప్లేయర్లు వేలంలోకి రానున్నారు. ఇందులో 104 మంది భారత క్రికెటర్లు కాగా, 61 మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. జాబితాలో ఉన్న క్రికెటర్లలో 56 మంది క్యాప్‌డ్ ప్లేయర్లు కాగా, 109 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు ఉన్నారు.

శనివారం హైదరాబాద్‌లో అగ్నివీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎయిర్ మార్షల్ ఆర్ రధీశ్

అగ్నివీర్ వనితలు

- ఘనంగా వాయు అగ్నివీర్ల పాసింగ్ ఔట్ పరేడ్
- ఆకట్టుకున్న 153 మంది అగ్నివీర్ల విన్యాసాలు
- 2,280 మందికి 22 వారాలపాటు శిక్షణ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): భారత వాయుసేనలోకి అగ్నివీర్ వనితలు అడుగుపెట్టారు. పురుషులతో సమానంగా కదం కలిపి కవాతు నిర్వహించారు. వాయుసేనకు చెందిన మహిళా అగ్నివీర్లు తొలిసారిగా పురుషులతో కలిసి కవాతు చేశారు. హైదరాబాద్‌లోని ఎయిర్‌మెన్ ట్రైనింగ్ స్కూల్‌లో 2,280 మంది వాయు అగ్నివీర్లకు 22 వారాలపాటు శిక్షణ ఇచ్చి, శనివారం పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌లో 153 మంది మహిళా వాయు అగ్నివీర్ల కవాతు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎయిర్ మార్షల్ ఆర్ రధీశ్ అగ్నివీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వాయు అగ్నివీర్లను అభినందించారు. అవార్డులు ప్రదానం చేశారు. వాయు సేన సైనిక సంసిద్ధతను, లక్ష్యాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా వాయు సేనలోకి అగ్నివీర్లను పంపిన వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు. వైమానికదళంలో కూడా ఈ ఏడాది జూన్ 28న అగ్నిపథ్ పథకాన్ని తొలిసారిగా కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. వాయు అగ్నివీరులంతా దేశం గర్వించేలా విధులు నిర్వర్తించాలని ఎయిర్ మార్షల్ రధీశ్ పిలుపునిచ్చారు.

ఉత్తమ ప్రదర్శన కనబర్చిన అగ్నివీర్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న ఎయిర్ మార్షల్

ఆరెస్సెస్ నేతకు ఆహ్వానం..

డీయూలో వివాదం

న్యూఢిల్లీ : ఢిల్లీ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ హిందూ స్టడీస్ ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా ఆరెస్సెస్ కార్యదర్శి భరత్‌భూషణ్‌ను ఆహ్వానించారు. ఈ నిర్ణయాన్ని విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ సభ్యులు ఖండించారు. మతపరమైన విభజనకు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకుంటారనడానికి ఇదే నిదర్శనమని ఆరోపించారు.

అధికారి లంచం కేసు.. మదురై ఈడీ ఆఫీసులో సోదాలు

మదురై, డిసెంబర్ 2: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారి అంకిత్ తివారీ లంచం కేసులో తమిళనాడు డైరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్(డీవీఏసీ) అధికారులు శనివారం మదురైలోని ఈడీ సబ్ జోనల్ కార్యాలయంలో దాదాపు 13 గంటలపాటు సోదాలు చేపట్టారు. అంకిత్ వివారీ నివాసంలో కూడా తనిఖీలు చేపట్టినట్టు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. లంచం నేరారోపణలకు సంబంధించిన పలు పత్రాలను స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపాయి. ఆదాయానికి మంచిన ఆస్తుల కేసులో అంకిత్ తివారీ శుక్రవారం ఓ వైద్యుడి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకొంటుండగా డీవీఏసీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్న విషయం తెలిసిందే.

రాజ్యం బలహీనపక్షాల వైపు ఉండాలి

- సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ప్రభుత్వం(రాజ్యం) ఎప్పుడూ బలహీన వర్గాల పక్షానే ఉండాలని, వారు సంఖ్యాపరంగా గానీ, సామాజికపరంగా గానీ మైనారిటీ కావచ్చునని, కానీ తద్వా రా పౌరులు ప్రజాస్వామ్య పాలనలో స్వేచ్ఛగా జీవించగలుగుతారని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. జస్టిస్ కేశవ చంద్ర మెమోరియల్ వ్యాసరచన పోటీకి అతిథిగా విచ్చేసిన ఆయన ప్రజాస్వామ్యంలో మెజారిటీ వర్గీయులకు వారి మార్గముంటుందని, కానీ మైనారిటీ తన అభిప్రాయాన్ని కలిగి ఉండాలని అన్నారు. బానిసత్వ నిర్మూలన, కుల నిర్మూలన, లింగ మైనారిటీల విముక్తి, మత సామరస్యం ఇలా అన్నీ ఒకప్పుడు భిన్న అభిప్రాయాలని, అయితే ఈ భిన్న అభిప్రాయాలు ఒక ముఖ్యమైన సంభాషణను ప్రారంభించడం ద్వారా మన సమాజాన్ని ప్రాథమికంగా పునర్నిర్మించగలిగే శక్తికి కలిగి ఉన్నాయని సీజేఐ అన్నారు.

దక్షిణ ఫిలిప్పైన్స్‌లో భూకంపం..

సునామీ హెచ్చరికలు జారీ

మనీలా, డిసెంబర్ 2: దక్షిణ ఫిలిప్పైన్స్‌లోని మిండానావో ద్వీప తీర ప్రాంతంలో శనివారం బలమైన భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైంది. 32 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీంతో పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. భూకంప తీవ్రత, కేంద్రం లోతు అధారంగా దక్షిణ ఫిలిప్పైన్స్‌తో పాటు ఇండోనేషియా, మలేషియా, పలావ్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ అలలు తాకే అవకాశం ఉన్నదని పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్(పీటీడబ్ల్యూసీ) పేర్కొన్నది. మిండానావో తూర్పు తీరంలోని సురిగావ్ దేల్ సుర్, దావో ఓరియంటల్ ప్రావిన్స్‌ల ప్రజలు వెంటనే ఎగువ మైదాన ప్రాంతాలకు వెళ్లాలని ఓ ఫిలిప్పైన్స్ ప్రభుత్వం ఏజెన్సీ పేర్కొన్నది.

ఐరాస కీలక కమిటీలో భారత్‌కు సభ్యత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల్ని నిర్దేశించే ఐక్యరాజ్యసమితి (ఐరాస)కి చెందిన అత్యంత కీలకమైన కమిటీలో భారత్ సభ్య దేశంగా ఎన్నికైంది. రోమ్‌లోని ఐరాస ఫుడ్, అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'సీఏసీ' 46వ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఆసియా ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించే సభ్య దేశంగా భారత్ ఏకగ్రీవంగా ఎంపికైంది. ఐరాస ఎగ్జిక్యూటివ్ కమిటీలో ముఖ్య విభాగమైన 'సీఏసీ' (కోడెక్స్ అలిమాంటేరియస్ కమిషన్)లో సభ్య దేశంగా ఎన్నికయ్యేందుకు అనేక దేశాలు ఆసక్తి చూపుతాయి. వివిధ రకాల ఆహార ఉత్పత్తులకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాల్ని నిర్దేశించటంలో, నిర్ణయాత్మక ప్రక్రియలో సభ్య దేశంగా భారత్ కీలక ప్రాత పోషిస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.